ADMISSIONS ARE IN PROGRESS 2024-25
Secretary & Correspondent
Bikki Venkateshwarlu
M.Sc (Physicis), M.Ed.
Join your kids with us & Empower their Academic Excellence with Ethical Foundations
INDIRA VIDYALAYA
Nursery to VII class, English Medium
Near Bodrai, Mahabubabad.
Cell: 9701912300, 9705412300


దిన పత్రిక
# తొలి సమయం
వాస్తవమే గమ్యం.. గమనం...

సంపుటి : 02 సంచిక : 201 మంగళవారం 29-07-2025 ఎడిటర్ : వేముల అయోధ్య రాములు పేజీలు : 4 వెల : 5 రూ/..

## పహల్గాం ఉగ్రవాదుల ఎన్‌కౌంటర్

**సులేమాన్ సహా ముగ్గురి హతం**

**ఉగ్రవాదుల వద్ద చైనా శాటిలైట్ కమ్యూనికేషన్ పరికరాలు**



**శ్రీనగర్, జూలై 28:** పహల్గాం ఉగ్రదాడితో 26 మందిని పొట్టనబెట్టుకున్న ముష్కరులను భద్రతాబలగాలు మట్టుబెట్టాయి. 'ఆపరేషన్ మహాదేవ్' పేరుతో సోమవారం ఉదయం చేపట్టిన దాడుల్లో.. పహల్గాం మాస్టర్‌మైండ్ సులేమాన్ షా అలియాస్ హాషిం మూసా అలియాస్ అబూ సులేమాన్, మరో ఇద్దరు ఉగ్రవాదులు హతమయ్యారు. మృతిచెందిన మిగతా ఇద్దరు ఉగ్రవాదులను యాసిర్ అలియాస్ హారీస్, అబూ హమ్జాగా అనుమానిస్తున్నారు. నెల రోజుల కిందట భద్రతాబలగాలు సులేమాన్, ఇతర ఉగ్రవాదుల కోసం వేటను ప్రారంభించాయి. ఈ క్రమంలో దాచిగామ్ అడవులను జల్లెడ పట్టాయి. దట్టమైన అడవుల్లో.. హర్వాన్ ప్రాంతంలో శాటిలైట్ సిగ్నల్స్ వెళ్తున్నట్లు గుర్తించిన బలగాలు.. 14 రోజులుగా ఆ ప్రాంతంపై నిఘా పెట్టి, ఉగ్రవాదులను ట్రాక్ చేశాయి. రెండ్రోజుల క్రితం ఉగ్రవాదుల షెల్టర్ వద్ద దాడికి వ్యూహాన్ని రచించాయి. ఈ క్రమంలో స్థానిక సంచార జాతుల సహాయం తీసుకున్నాయి. ఉగ్రవాదులు పైన టెంట్ వేసుకుని, భూమిలో తవ్విన గొయ్యిలో నక్కినట్లు గుర్తించాయి.





# రాష్ట్రపతిని కలుద్దాం

- బీసీ రిజర్వేషన్ల కోసం కేంద్రం మీద ఒత్తిడి పెంచుదాం.. మూడు రోజులు ఢిల్లీలోనే
- ఆగస్టు 5న పార్లమెంటులో వాయిదా తీర్మానాలు
- 6న జంతర్ మంతర్ వద్ద ప్రజా ప్రతినిధుల ధర్నా
- ఏడో తేదీన 200 మంది నాయకులతో రాష్ట్రపతి వద్దకు
- బీసీ రిజర్వేషన్ బిల్లులను వెంటనే ఆమోదించాలని వినతి
- కార్యాచరణకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం
- బీజేపీ బీసీ ఎంపీలూ బిల్లుల ఆమోదానికి సహకరించండి
- అసెంబ్లీలో మద్దతిచ్చి.. ఢిల్లీలో మోకాలడ్డుతున్న బీజేపీ
- ఆమోదించినప్పుడు పరిమితి గురించి తెలియదా!?
- మీడియాతో మంత్రులు పొన్నం, వాకిటి, కొండా సురేఖ
- ప్రతి బీసీ బిడ్డా ఢిల్లీకి తరలి రావాలని పిలుపు

**హైదరాబాద్, జూలై 28:** బీసీ రిజర్వేషన్ల సాధనకు ఢిల్లీ వెళ్లి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని రాష్ట్ర మంత్రివర్గ సమావేశం నిర్ణయించింది. ఈ మేరకు కార్యాచరణను ఖరారు చేసింది. ఆగస్టు 5, 6, 7 తేదీల్లో చేపట్టాల్సిన కార్యాచరణకు ఆమోదం తెలిపింది. పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో బీసీ రిజర్వేషన్ల బిల్లుల ఆమోదంలో జరుగుతున్న జాప్యానికి నిరసనగా ఆగస్టు ఐదో తేదీన పార్టీ ఎంపీల ద్వారా పార్లమెంటు ఉభయ సభల్లో వాయిదా తీర్మానాలు ఇవ్వాలని క్యాబినెట్ నిర్ణయించింది. రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజా ప్రతినిధులం దరితో ఆగస్టు 6న 'చలో ఢిల్లీ' కార్యక్రమాన్ని నిర్వహించి, జంతర్ మంతర్ వద్ద ధర్నా చేయాలని నిర్ణయం తీసుకుంది. అలాగే, ఆగస్టు ఏడో తేదీన ముఖ్యమంత్రి తోపాటు మంత్రులు, పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సహా దాదాపు 200 మంది ప్రతినిధులతో రాష్ట్రపతిని కలిసి బిల్లుల ఆమోదం కోరుతూ వినతి పత్రం అందించాలని నిర్ణయించింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లులను వెంటనే ఆమోదించాలని విజ్ఞప్తి చేయాలని నిర్ణయించింది. ఇందుకు ముఖ్యమంత్రి సహా లోక్‌సభలో కాంగ్రెస్ పక్షనేత, రాజ్యసభ పక్షనేత రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ కోరతారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సోమవారం సచివాలయంలో క్యాబినెట్ సమావేశం జరిగింది. నాలుగున్నర గంటలకు పైగా సాగిన ఈ సమావేశంలో ప్రధానంగా స్థానిక సంస్థల ఎన్నికలు, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై చర్చించారు. అనంతరం మంత్రులు కొండా సురేఖ, వాకిటి శ్రీహరిలతో కలిసి బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విలేకరులకు వివరాలు వెల్లడించారు. "రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. విద్యా, ఉద్యోగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాల్సి ఉంది.

## ప్రజల వద్దకు కాంగ్రెస్

**31 నుంచి ఆగస్టు 6 వరకు నియోజకవర్గాల్లో పాదయాత్ర**

**పాల్గొననున్న మహేశ్‌గౌడ్, మీనాక్షి, మంత్రులు, నేతలు**

**పరిగిలో యాత్ర ప్రారంభం**



**హైదరాబాద్/ వికారాబాద్, జూలై 28:** స్థానిక ఎన్నికలకు క్షేత్రస్థాయి నేతలు, కార్యకర్తలను సమాయత్తం చేసేందుకు 'ప్రజల వద్దకు కాంగ్రెస్' అనే పేరుతో టీపీసీసీ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఉమ్మడి జిల్లాల్లో ఒక్కో నియోజకవర్గంలో పాదయాత్ర చేపట్టింది. తొలి విడత ఈ నెల 31 నుంచి 6 రోజుల పాటు ఉమ్మడి జిల్లాల్లో రోజుకో నియోజకవర్గం చొప్పున వారి పాదయాత్ర సాగనుంది. 'ప్రజల వద్దకు కాంగ్రెస్' పేరుతో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలోని వికారాబాద్ జిల్లా పరిగి మండలం రంగాపూర్‌లో ఈ నెల 31 సాయంత్రం 5 గంటలకు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌తో కలిసి ఏఐసీసీ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జి మీనాక్షి నటరాజన్ ప్రారంభించనున్నారు. 10 కి.మీ దూరం పాదయాత్రలో పాల్గొని, అదేరోజు రాత్రి ఆ రాత్రి నియోజకవర్గంలోనే వారు పల్లె నిద్ర చేస్తారు. మరునాడు ఉదయం పార్టీ నేతలు, కార్యకర్తలతో కలిసి ఆయా పల్లెల్లో శ్రమదానంలో పాల్గొంటారు.

## ఎస్టీల నిధులను వారికే ఖర్చు చేయాలి

**గత ప్రభుత్వ హయాంలో ఆ నిధులు పక్కదారి**

**మంత్రులు సీతక్క, అడ్లూరి లక్ష్మణ్**



**హైదరాబాద్, జూలై 28:** ఎస్టీలకు కేటాయించిన నిధులను అదే అసెంబ్లీ నియోజకవర్గంలో, అదే జిల్లాలో వారికే సర్దుబాటు చేయాలే తప్ప.. మైదాన ప్రాంతాలకు తరలించవద్దని మంత్రి సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ సూచించారు. గత ప్రభుత్వ హయాంలో ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు పక్కదారి పట్టాయని అన్నారు. దామోదర సంజీవయ్య సంక్షేమ భవన్‌లో సోమవారం 7వ గిరిజన సంక్షేమ సలహా మండలి సమావేశం జరిగింది. మంత్రులు సీతక్క, అడ్లూరి లక్ష్మణ్‌లతో పాటు డిప్యూటీ స్పీకర్ రామచంద్రనాయక్, ఆదిలాబాద్ ఎంపీ గోడెం నగేశ్, ఆదివాసీ గిరిజన ఎమ్మెల్యేలు, ట్రైకార్ ఛైర్మన్ బెల్లయ్య నాయక్ తదితరులు పాల్గొన్నారు. సీతక్క మాట్లాడుతూ.. గిరిజన సంక్షేమం విషయంలో గత ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్దుతున్నామని చెప్పారు.

## ప్రధాని మోదీని బీసీ కాదనడం సిగ్గుచేటు

**సీఎం రేవంత్‌పై ఎంపీ ఆర్. కృష్ణయ్య ధ్వజం**



**న్యూఢిల్లీ, జూలై 28:** ప్రధాని మోదీని బీసీ కాదనడం సిగ్గు చేట ని ఎంపీ ఆర్.కృష్ణయ్య.. సీఎం రేవంత్ రెడ్డి పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు దేశంలోని 70 కోట్ల మంది బీసీలను అగౌరవపరిచేలా ఉన్నాయన్నారు. సోమవారం తెలంగాణభవన్‌లో ఆర్.కృష్ణయ్య మీడియాతో మాట్లాడారు. ప్రధాని మోదీని బీసీ కాదనడానికి రేవంత్‌రెడ్డి ఏమన్నా రెవెన్యూ ఇన్‌స్పెక్టరా? తహశీల్దారా? అని ప్రశ్నించారు. బీజేపీని బీసీ వ్యతిరేక పార్టీగా రేవంత్ రెడ్డి విమర్శించడం తగదని హితవు పలికారు. బీసీని ప్రధానిని చేసిన ఘనత బీజేపీదేనని, కేంద్ర మంత్రివర్గంలో 27మంది బీసీలకు చోటు కల్పించిందన్నారు. బీసీ రిజర్వేషన్లను అమలు చేయడం చేతకాక కాంగ్రెస్ పనికిమాలిన రాజకీయాలు చేస్తోందని విమర్శిం చారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 243డీప్రకారం స్థానిక సంస్థల రిజర్వేషన్లు రాష్ట్రప్రభుత్వ పరిధిలోనివని అన్నారు. ఇచ్చిన హామీ మేరకు స్థాని క సంస్థల్లో 42శాతం రిజర్వేషన్లను కాంగ్రెస్ అమలుచేయాలని డిమాండ్ చేశారు.

## ఉగ్రవాదాన్ని తుదముట్టించేందుకు ఎంతవరకైనా వెళ్తాం

- 22 నిమిషాల్లో పాక్‌లోని 7 ఉగ్రస్థావరాలను ధ్వంసం చేశాం
- దాయాది తోక జాడిస్తే మళ్లీ సిందూర్.. లోక్‌సభ చర్చలో రాజ్‌నాథ్
- మన విమానాలు ఎన్ని కూలాయో చెప్పాలి: కాంగ్రెస్
- మన సైనికుల పరాక్రమాన్ని ప్రపంచమంతా చూసింది
- కాల్పుల విరమణలో ట్రంప్ ప్రమేయం లేదు
- సైనికుల సత్తాపై విపక్షాలకు అనుమానమా?
- పాక్ విమానాలు ఎన్ని కూల్చారని ప్రశ్నించరేం?
- లోక్‌సభలో విపక్షాలపై రాజ్‌నాథ్ ధ్వజం



**న్యూఢిల్లీ, జూలై 28:** ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో సహా పెకలించివేసేందుకు నవీన భారతదేశం ఎంతవరకైనా వెళ్తుందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. భారత సాయుధ దళాలు ఉగ్రవాద స్థావరాల ధ్వంసం విషయంలో నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవడంతో ఆపరేషన్ సిందూర్‌కు విరామం ఇచ్చామని చెప్పారు. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌పై సోమవారం లోక్‌సభలో నిర్వహించిన ప్రత్యేక చర్చలో రాజ్‌నాథ్ మాట్లాడారు. పాకిస్థాన్‌పై తీసుకున్న సైనిక చర్యతో భారత్ తన రక్షణ కోసం ఎంతకైనా తెగిస్తుందని ఉగ్రవాదులు, వారి మద్దతుదారులకు గట్టి సందేశం ఇచ్చినట్లయిందని చెప్పారు. శాంతి వచనాలను అర్థం చేసుకోలేని వారిపై కఠిన చర్యలు తప్ప మరో ప్రత్యామ్నాయం లేదని స్పష్టం చేశారు. "మే 7న రాత్రి భారత బలగాలు తమ శక్తి, సామర్థ్యాలు చాటిచెప్పాయి. పీవోకే, పాక్‌లోని ఉగ్రవాద స్థావరాలపై దాడులు జరిపాయి. ఏడు ఉగ్ర శిబిరాలను పూర్తిగా ధ్వంసం చేశాయి. కేవలం 22 నిమిషాల్లో ఆపరేషన్ పూర్తి చేశాయి. సైన్యానికి అభినందనలు. దేశ ప్రజలను రక్షించడం మా ప్రభుత్వ బాధ్యత" అని రాజ్‌నాథ్ తెలిపారు. భారత్-పాక్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిర్చింది తానేనన్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్యలను తిరస్కరించారు. మనపై ఎవరి ఒత్తిడీ లేదని స్పష్టం చేశారు. పాక్ మళ్లీ తోక జాడిస్తే మళ్లీ ఆపరేషన్‌ను కొనసాగిస్తామన్నారు. "ఆపరేషన్ సిందూర్‌తో మన వాయుసేన పరాక్రమాన్ని ప్రపంచమంతా చూసింది. ఉగ్ర శిబిరాల్లోకి చొచ్చుకెళ్లి మరీ ఉగ్రవాదులను హతమార్చాం" అని రాజ్‌నాథ్ చెప్పారు. "మనం చేసిన దాడులతో పాక్ కాళ్ల బేరానికి వచ్చింది. మన త్రివిధ దళాలను తట్టుకోలేక పాక్ డీజీఎంవో వెంటనే మన కు ఫోన్ చేశారు. కాల్పుల విరమణ చేసుకుందామని మన డీజీఎంవోను కోరారు" అని స్పష్టం చేశారు.

**పాక్ విమానాల గురించి అడగరేం?**

మన సైనికుల సత్తాపై అనుమానాలు వ్యక్తం చేయడం, ప్రశ్నించడం సరికాదని రాజ్‌నాథ్ విపక్షాలకు హితవు పలికారు. "ప్రభుత్వాన్ని ప్రశ్నించడం ప్రతిపక్షాల పని. కానీ, మన ప్రతిపక్ష సభ్యులు మాత్రం మన యుద్ధ విమానాలు ఎన్ని కూలిపోయాయని పదేపదే ప్రశ్నిస్తుంటారు. మన దళాలు ఎన్ని పాకిస్థానీ విమానాలను కూల్చేశారని మాత్రం అడగరు" అని విపక్షాలపై ధ్వజమెత్తారు.

## కన్వర్ట్ అయ్యింది మోదీ కాదు.. రాహుల్

**- బీసీల సంక్షేమంపై కాంగ్రెస్ సర్కార్‌ది నటనే - ముస్లింలకు రిజర్వేషన్‌నే మేం వ్యతిరేకిస్తున్నాం**

**- బీసీలకు 42% ఇవ్వాలన్న డిమాండ్‌తో 2న ధర్నా - మీడియాతో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు**



**హైదరాబాద్, జూలై 28:** "ప్రధాని మోదీ కన్వర్టెడ్ బీసీ అంటూ రేవంత్‌రెడ్డి విమర్శలు చేయడం విడ్డూరంగా ఉంది. వాస్తవానికి కన్వర్ట్ అయ్యింది మోదీ కాదు... కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీనే. ఈ విషయాన్ని కాంగ్రెస్ నాయకులు గుర్తించాలి" అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు వ్యాఖ్యానించారు. బీసీల సంక్షేమంపై కాంగ్రెసది నటనేనని, మాటలు చెప్పడం తప్ప.. చేతల్లో చిత్తశుద్ధి లేదని దుయ్యబట్టారు. ఈ నటనకే ఆస్కార్ అవార్డు ఇవ్వొచ్చని దుయ్యబట్టారు. ఇది బీసీలకు వెన్నుపోటు పొడవడమేనని ధ్వజమెత్తారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం రాంచందర్‌రావు మీడియాతో మాట్లాడారు. బీసీల ఓట్ల కోసం కాంగ్రెస్ ఆలోచిస్తుంటే.. వారి సంక్షేమం గురించి బీజేపీ ఆలోచిస్తోందన్నారు. బీసీల ముసుగులో ముస్లింలకు రిజర్వేషన్ కల్పించాలన్న కాంగ్రెస్ కుట్రనే బీజేపీ వ్యతిరేకిస్తోందని తెలిపారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ వచ్చే నెల 2న ధర్నాచౌక్ వద్ద మహాధర్నా చేపట్టనున్నట్లు ప్రకటించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కుల గణన రాజ్యాంగబద్ధంగా జరిగిన ప్రక్రియకాదని, అది గణాంకాల సేకరణ మాత్రమేనన్నారు.

## సిగాచి యాజమాన్యంతో రేవంత్ కుమ్మక్కు

**ఇంకా చర్యలెందుకు తీసుకోలేదు**

**వెంటనే పరిహారమివ్వాలి: హరీశ్‌రావు**



**సంగారెడ్డి/హైదరాబాద్, జూలై 28:** సిగాచి పరిశ్రమ యాజమాన్యంతో సీఎం రేవంత్‌రెడ్డి కుమ్మక్కయ్యారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. ఘటన జరిగి నెలరోజులు కావొస్తున్నా యాజమాన్యాన్ని ఎందుకు అరెస్టు చేయడం లేదని మండిపడ్డారు. ప్రమాదంలో చనిపోయిన మృతుల కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం హరీశ్‌రావు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సంగారెడ్డి కలెక్టరేట్‌కు ర్యాలీగా వెళ్లి వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వం ప్రకటించిన పరిహారాన్ని వెంటనే చెల్లించాలని, యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు. మృతులకు రూ.కోటి పరిహారం చెల్లిస్తామని సీఎం రేవంత్ ప్రకటించారని హరీశ్‌రావు గుర్తు చేశారు. పరిశ్రమలో 46 మంది చనిపోతే ఇప్పటివరకు కేవలం 15 మందికి, అది కూడా రూ.10లక్షల చొప్పున మాత్రమే ఇచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గల్లంతైనట్లుగా ప్రకటించిన 8 మందిని కూడా చనిపోయినట్లుగా ధ్రువీకరించి వారి కుటుంబాలకు కూడా రూ.కోటి పరిహారం అందించాలని హరీశ్ ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. మరోవైపు, సిగాచిలో ప్రమాదానికి గల కారణమేంటనేది తేల్చడంతో పాటు నిర్వాహకులను అరెస్టు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేదంటే సిగాచి పరిశ్రమ ముందే టెంటు వేసుకొని దీక్ష చేపడతామని హెచ్చరించారు. కాగా, సిగాచి కంపెనీ ప్రమాద బాధిత కుటుంబాల ఆవేదన వింటుంటే గుండె తరుక్కుపోతోందని.. గుండెలవిసేలా రోదిస్తున్న వారి ఆవేదన రేవంత్‌రెడ్డికి కనబడటం లేదా.. అని హరీశ్‌రావు ఎక్స్‌లో పోస్టు చేశారు. వారిని ఓదార్చాలంటే మాటలు కూడా రావడం లేదన్నారు.

## చిన్నమాడురు ఎంపిటీసి క్లస్టర్ సమావేశంలో

# పాల్గొన్న పాలకుర్తి ఇంచార్జ్ ఝాన్సి రాజేందర్ రెడ్డి



**తొలి సమయం కొడకండ్ల జూలై 28**

దేవరుప్పుల మండలంలోని చిన్నమాడురు గ్రామంలోనిర్వహించిన ఎంపీటీసీ క్లస్టర్ సమావేశంలో టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ మరియు పాలకుర్తి నియోజకవర్గ ఇంచార్జ్ ఝాన్సి రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు..ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ స్థాయి ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. గ్రామస్థాయి సమస్యలపై చర్చించడంతో పాటు, రాబోయే ఎన్నికల వ్యూహంపై ఈ సమావేశంలో దృష్టి పెట్టారు..ఈ సందర్భంగా ఝాన్సి రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ .కాంగ్రెస్ పార్టీ పట్ల విశ్వాసంతో ఉన్నారు. చిన్నమాడురు, రంభోజిగూడెం గ్రామాల ప్రజలు కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా నిలుస్తున్నారు. రాబోయే ఎన్నికల్లో ఈ రెండు గ్రామాలలో కాంగ్రెస్ జెండా ఎగరాలే. గతంలో మోసపోయిన ప్రజలు ఈసారి తెలివిగా నిర్ణయం తీసుకోవాలని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గెలిస్తేనే పేదల భద్రత, రైతులకు న్యాయం, యువతకు ఉపాధి వంటి అంశాలు సాధ్యమవుతాయి. స్థానిక సమస్యలు, సంక్షేమ పథకాలు, యువత భాగస్వామ్యం, మహిళల అభివృద్ధిపై పార్టీ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలను ఉద్దేశించి పిలుపుని చ్చారు. గ్రామ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ సమష్టిగా పనిచేయాల న్నారు.సమావేశం ముగింపులో స్థానిక నాయకులు, మహిళా శక్తి, యువజన విభాగాలు ఝాన్సి తమ మద్దతు ప్రకటించారు..

# విద్యార్థులకు రమేష్ అండగా నిలవడం అభినందనీయం

## తొర్రూరు ఎంఈఓ బుచ్చయ్య

**తొలి సమయం తొర్రూరు జులై 28**

తొర్రూరు ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న పేద విద్యార్థులకు రమేష్ నాయక్ అండగా నిలవడం అభినందనీయమని తొర్రూరు ఎంఈఓ మహంకాళి బుచ్చయ్య అన్నారు. మండలంలోని వెలికట్ట శివారు పెద్ద మంగ్య తండ గ్రామపంచాయతీలో ఉన్న ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సోమవారం ఆ గ్రామ మాజీ సర్పంచ్,శారద ఐటిఐ కళాశాల కరస్పాండెంట్ జాటోత్ శారద రమేష్ నాయక్ సహకారంతో పుస్తకాలు, నోట్ పుస్తకాలు, కుర్చీలను ఎంఈఓ బుచ్చయ్య చేతుల మీదుగా అందజేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు.ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సౌకర్యాలు కల్పించేందుకు స్థానికులు ముందుకు రావడం అభినందనీయమన్నారు. పాఠశాలకు బీరువా, రెండు ఫ్యాన్లు ఇచ్చేందుకు ముందుకు వచ్చిన సంతోష్, పాఠశాలలో మొక్కలు అందించిన రవి నాయక్, పాఠశాల, గుడి భూమి దాత చిన్న మంగ్య లను అభినందించారు. ఈ కార్యక్రమంలో



పంచాయతీ కార్యదర్శి నీరజ, పాఠశాల హెచ్ఎం మాలతి, ఉపాధ్యాయురాలు ప్రేమ దీపిక,స్థానికులు జాటోత్ రవి నాయక్, జాటోత్ చిన్న మంగ్య, జాటోత్ సంతోష్ నాయక్, తుకారం,అంగన్వాడీ టీచర్లు శాంతి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీలను బలోపేతం చేయడమే లక్ష్యం

### జిల్లా ఇంచార్జి ముమ్ముడిపుడి సుబ్బారావు మాదిగ - సమావేశంలో పాల్గొన్న నూతన కమిటీ సభ్యులు



**తొలి సమయం పెద్దవంగర, జూలై 28**

మాదిగ జాతిని చైతన్య వంతులను చేయుటకు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ఎనలేని కృషి చేస్తున్నారని మహబూబాబాద్ జిల్లా ఇంచార్జి ముమ్ముడిపుడి సుబ్బారావు మాదిగ అన్నారు. మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు సోమవారం మండల కేంద్రంలోని ఓ గార్డెన్లో సమావేశం ఏర్పాటు చేసి, మాట్లాడారు. గతంలో ఎమ్మార్పీఎస్ లో పనిచేసినటువంటి వ్యక్తులను నేటి నుండి ఎమ్మార్పీఎస్ నుండి పూర్తిగా తొలగిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్పిని పూర్తిగా బలోపేతం చేయాలని, రానున్న రోజుల్లో రాజ్యాధికారం సాధించడమే ధ్యేయంగా ప్రతి మాదిగ బిడ్డ పనిచేయాలని కోరారు. మంద కృష్ణ చేసిన పోరాటాల ఫలితమే ఏబీసీడీ వర్గీకరణ, అంబులెన్సు, ఆరోగ్యశ్రీ పథకాలని గుర్తు చేసారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ పెద్దవంగర మండల ఇంచార్జిగా కొత్తపెల్లి మధు మాదిగ, కో ఇంచార్జిలుగా చిలుక సిద్ధు మాదిగ, జలగం నాగరాజు మాదిగ, ఎంఎస్పి మండల ఇంచార్జిగా జలగం శ్రీనివాస్ మాదిగలు నియమితులయ్యారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ జిల్లా నాయకుడు ఈదురు సైదులు మాదిగ, సీనియర్ నాయకులు జలగం జంపయ్య మాదిగ, చిలుక బిక్షపతి మాదిగ, దంతాలపల్లి ఉపేందర్ మాదిగ, చింతల ఐలయ్య మాదిగ, చిలుక వెంకన్న మాదిగ, చిలుక సైదులు మాదిగ, చిలుక శ్యామ్ మాదిగ తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా ప్రజలకు

# నిత్యం అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేయాలి

### భద్రాచలం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ను సందర్శించిన ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ ఐపీఎస్

**తొలి సమయం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం జూలై 28**

భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ ఐపిఎస్ భద్రాచలం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ను సందర్శించారు.ముందుగా పోలీస్ స్టేషన్లో విధులు నిర్వర్తించే సిబ్బంది నుండి ఏఎస్పీ గౌరవ వందనాన్ని స్వీకరించారు.పోలీస్ స్టేషన్లో విధులు నిర్వర్తించే సిబ్బంది యొక్క ప్రభుత్వ కిట్ ఆర్టికల్స్ ను ఏఎస్పీ తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు.అనంతరం అక్కడ ఉన్న పోలీస్ అధికారులు మరియు సిబ్బందికి పలు సూచనలు చేశారు.పోలీస్ స్టేషన్ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని,వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్కు వచ్చే బాధితులకు న్యాయం చేకూర్చే విధంగా బాధ్యతగా మెలగాలని సూచించారు. అనంతరం పోలీస్ స్టేషన్ రికార్ధులను పరిశీలించారు.పోలీస్ స్టేషన్లో వర్టికల్స్ వారీగా విధులు నిర్వర్తించే సిబ్బందిని ఒక్కొక్కరిగా వారి పనితీరు గురించి పరిశీలించారు. మద్యం సేవించి వాహనాలను నడుపుతూ పట్టుబడిన వ్యక్తులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.ట్రాఫిక్ విధులే కాకుండా సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలకు అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని తెలిపారు.రోడ్లపై సంచరిస్తూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు.పోలీస్ స్టేషన్లో పనిచేసే అధికారులు, సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు



.అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఏఎస్పీ తో పాటు అధికారులు మరియు సిబ్బంది మొక్కలను నాటారు.ఈ కార్యక్రమంలో భద్రాచలం ట్రాఫిక్ ఎస్సై తిరుపతితో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడి మృతికి తీవ్ర సంతాపం

### నేడు కంచిరావుపల్లి సుధాకర్ గౌడ్ దశదినకర్మలో పాల్గొన్నడాక్టర్ జిల్లెల ఆదిత్య రెడ్డి



**తొలి సమయం పెబ్బేరు జూలై 29**

పెబ్బేరు మండలం కంచరావుపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సుధాకర్ గౌడ్ గారి మృతి తీవ్ర బాదను కలిగించిందని %ూాఖ్రాజ% నేషనల్ కోఆర్డినేటర్ వనపర్తి నియోజకవర్గ యువ నాయకులు డాక్టర్ జిల్లేల ఆదిత్య రెడ్డి గారు ఒక పట్టణంలో తెలియజేశారు.వారి మృతి చెందిన రోజు వివిధ కార్యక్రమాల నిమిత్తం రాలేదని చింతిస్తూ ఈరోజు వారి దశదినకర్మలో పాల్గొని సుధాకర్ గౌడ్ గారిని స్మరించుకోవడం జరిగింది.వారు కనిపిం చినప్పుడల్లా పార్టీ కార్యక్రమాల్లో ఎంతో ఉత్సాహంగా ఉల్లాసంగా కార్యకర్తల ను అందరిని ఉత్తేజపరిచే వ్యక్తి అని వారు లేని లోటు కాంగ్రెస్ పార్టీకి నష్టమని తెలియజేయడం జరిగింది. వారి కుటుంబ సభ్యులకు కొంత ఆర్థిక సహాయం అందించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి మనో ధైర్యం కలిగించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాంపురం సహదేవుడు శశిధర్ రెడ్డి రాజు నాయక్ ఎల్ల స్వామి నాయుడు రాము తదితరులు పాల్గొన్నారు.

## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న

# పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



**తొలి సమయం తొర్రూరు జూలై 28**

తిరుమల కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దివ్య దర్శన భాగ్యం ఈరోజు ఉదయం పాలకుర్తి శాసన సభ్యురాలుయశస్విని రాజరామ్మోహన్ రెడ్డి కి కలిగింది. ఆమె తన భర్త రాజరామ్మోహన్ రెడ్డి తో పాటు కుటుంబ సభ్యులతో కలిసి తిరుమలలో స్వామి వారి ప్రత్యేక దర్శనంలో పాల్గొన్నారు..ఈ సందర్భంగా వారు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో తీర్థ ప్రసాదాలు స్వీకరించి, వేద పండితుల ఆశీర్వాదం పొందారు. ఎమ్మెల్యే యశస్విని రెడ్డి తిరుమల సందర్శన సందర్భంగా టీటీడీ అధికారులతో సౌజన్యంగా మాట్లాడిన యశస్విని రాష్ట్ర ప్రజల శాంతి, మరియు పాలకుర్తి నియోజకవర్గ అభివృద్ధి కోసం స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు..

## ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ప్రతి

# దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించలి

### అదనపు కలెక్టర్ వేణుగోపాల్



**తొలి సమయం భద్రాద్రి కొత్తగూడెం జూలై 28**

సోమవారం ఐడిఓసి కార్యాలయ సమావేశ మందిరంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందనతో కలిసి ప్రజావాణి నిర్వహించి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఎండార్స్ చేశారు

**గ్రీవెన్స్ లో కొన్ని ఫిర్యాదులు.**

టేకులపల్లి మండలానికి చెందిన వాంకుడోత్ అశోక్ తాను బిఎస్సి అగ్రికల్చర్ పూర్తి చేసి ఉన్నానని జిల్లాలోని ఏటీఎంఏ ( అగ్రికల్చర్ టెక్నాలజీ మేనేజ్మెంట్ ఏజెన్సీ) నందు ఔట్సోర్సింగ్ పరిధిలో ఒక పోస్టుని తనకు ఇప్పించగలరని చేసిన దరఖాస్తును పరిశీలించి తగు చర్యలు నిమిత్తం జిల్లా వ్యవసాయ శాఖ అధికారికి ఎండార్స్ చేశారు. జూలూరుపాడు మండలం సాయిరాం తండా కు చెందిన గుగులోతు వీరు తన కుటుంబ సభ్యులతో కలిసి తాటాకు ఇంటిలో నివాసం ఉంటున్నానని తేదీ. 26/2/2025 న కరెంటు షార్ట్ సర్క్యూట్ కారణంగా తన ఇల్లు పూర్తిగా దగ్ధమై పిల్లల సర్టిఫికెట్స్, భూమి కాగితాలు, నగదు అన్ని దగ్గం అయ్యాయని తాము నివసించడానికి నివాసం లేక ఇబ్బంది పడుతున్నామని డిజాస్టర్ మేనేజ్మెంట్ కింద ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయగలరని చేసిన దరఖాస్తును పరిశీలించి తగు చర్య నిమిత్తం హౌసింగ్ పీడీ అధికారి గారికి ఎండార్స్ చేశారు.ఇల్లందుకు చెందిన పోకల రాధ తన తల్లి పోకల కోటమ్మ, గతంలో తల్లి పేరు మీద గృహపట్టా మంజూరయ్యిందని, (పట్టా నంబర్: 211). ప్రస్తుతం తన తల్లిదండ్రులు ఇద్దరూ మరణించగా, ఒంటరిగా ఉన్న తనను వారసురాలిగా గుర్తించి, వారసత్వ చట్ట ప్రకారం తమ ఇంటికి సంబంధించి గృహ పట్టాను తన పేరపై మంజూరు చేయవలసిందిగా కోరుతూ చేసిన దరఖాస్తును పరిశీలించి, తగిన చర్యలు నిమిత్తం ఇల్లందు తహసీల్దార్కు ఎండార్డ్ చేయబడింది.మణుగూరు కు చెందిన బత్తుల రాములు సర్వే నెంబర్ 138/1559 లో ఒక ఎకరం 20 కుంటల భూమి ఉన్నదని దానికి రైతు భరోసా డబ్బులు కూడా వస్తున్నాయని అట్టి పొలం ప్రభుత్వ మెడికల్ కళాశాల ఏర్పాటులో పోతున్నదని తనకు వ్యవసాయమే జీవనాధారమని, కావున తన భూమిని తనకు ఇప్పించగలరని చేసిన దరఖాస్తును పరిశీలించి తగు చర్య నిమిత్తం మణుగూరు తాసిల్దారు కు ఎండార్స్ చేశారు. జూలూరుపాడు మండలం అనంతారం గ్రామానికి చెందిన గడిగ వెంకటేశ్వర్లు తన కుమారుడు గడిగ జస్వంత్ ఎనిమిదో తరగతి చదువుటకు చుంచుపల్లి బీసీ వెల్ఫేర్ గురుకుల పాఠశాల నందు నందు సీటు ఇప్పించగలరని ఒకవేళ చుంచుపల్లి నందు సీటు రాలేనిచో మరి ఎక్కడైనా సీటు ఇప్పించగలరని చేసిన దరఖాస్తును పరిశీలించి తగు చర్యల నిమిత్తం ఆర్ సి ఓ కి ఎండార్స్ చేశారు.ఈ ప్రజావాణి కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ

### ప్రారంభించిన వనపర్తి జిల్లా బ్లాక్

### కాంగ్రెస్ అధ్యక్షుడు అక్కి శ్రీనివాస్ గౌడ్



**తొలి సమయం పెబ్బేరు జులై 28**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టత్మాకంగా చేపట్టిన పేదింటి కల సహకారం చేసే దిశగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్లకు వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి గారి ఆదేశాలతో నేడు పెబ్బేరు మున్సిపాలిటీ పరిధిలోని చెలిమిళ్ల 5వార్డ్ లో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు పెబ్బేరు మున్సిపాలిటీ చెలిమిళ్ల 5వ వార్డు ఇన్చార్జి డైరెక్టర్ రాములు,యుగంధర్ రెడ్డి, రణధీర్ రెడ్డి, రాజా గౌడ్, డి మన్యం, గోవిందమ్మ ఆధ్వర్యంలో భూమి పూజ చేసి, ముగ్గు పోసి ఇంటి పని ప్రారంభించారు . ఈ కార్యక్రమం లో సీనియర్ కాంగ్రెస్ నాయకులు మున్సిపాలిటీ ఇన్చార్జి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అత్తను దారుణంగా హత్య చేసిన అల్లుడు



**బచ్చన్నపేట జూలై 28 తొలి సమయం న్యూస్**
రోజు రోజుకు సమాజం ఎటుపోతుందో తెలియని పరిస్థితి చిన్న చిన్న వివాదాలకు క్షణికావేశంలో చంపుకునే వరకు వెళ్తున్నారు. అలాంటి ఘటననే మర్మాముల గ్రామ పంచాయతి అమ్లెట్ గ్రామం బంజరలో చోటు చేసుకుంది. పిల్లను ఇచ్చిన అత్తనే అల్లుడు హత్య చేశాడు..గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం జంగిలి వజ్రమ్మ (55) తన కూతురు భవానిని మద్దూరు మండలం ధర్మారం గ్రామానికి చెందిన జక్కుల మహేష్ కి ఇచ్చి వివాహం చేశారు. మహేష్, భవాని హైదరాబాద్ లో పని చేస్తూ అక్కడే నివాసం ఉంటున్నారు. ఇటీవల వారి ఇద్దరి మధ్య గొడవలు తలెత్తడంతో వారం క్రితం మద్దూరు పోలీస్ స్టేషన్ లో భర్త మహేష్ కొట్టాడని భవాని ఫిర్యాదు చేసింది. గత మూడు రోజుల క్రితం పెద్దమనుషుల సమక్షంలో రాజీ కుదిర్చుకొని అదివారం భవానిని తన భర్తతో అత్తగారి ఇంటికి పంపించారు. సోమవారం ఉదయం జక్కుల మహేష్ తన సోదరుడు జక్కుల హరీష్ ఇద్దరు కలిసి బంజర గ్రామానికి వచ్చారు. ఈ క్రమంలో అత్త, అల్లుడి మధ్య మాట మాట పెరిగి గొడవ పెద్దగా అవుతుండటంతో వజ్రమ్మ పక్కన వేరే వారి ఇంటి వద్దకు వెళ్లింది. కోపంతో అక్కడికి చేరుకున్న జక్కుల మహేష్ తన సోదరుడు జక్కుల హరీష్ ఇద్దరు కలిసి పదునైనా ఆయుధంతో వజ్రమ్మను దారుణంగా హత్య చేశారు. ఈ ఘటనతో గ్రామంలో ఒక్కసారిగా విషాద ఛాయలు నెలకొన్నాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని క్లూస్ టీంతో ఆధారాలను సేకరిస్తున్నారు.

# రేషన్ కార్డులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే. కూనంనేని


## ఆరులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తాం

**తొలి సమయం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతనగర్ జూలై 28**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు మంజూరు చేయడం చాలా సంతోష కరమని కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు తెలిపారు సుజాతనగర్ మండలంలోని రైతు వేదిక వద్ద మంజూరైన 767 రేషన్ కార్డులు పంపిణీ చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదల కోసం పేదలకు పంపిణీ చేయడం శుభపరిణామామని ట్రాక్టర్ ఉన్నవారికి రేషన్ కార్డులు మంజూరు చేసి ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరామన్నారు సుజాతనగర్ కార్పొరేషన్ కావడం నగర పాలక సంస్థగా మారి అభివృద్ధి చెందుతుందన్నారు మెప్మా పథకం ద్వారా పేదలకు ఉపాధి అవకాశాలు దొరుకుతాయి అన్నారు రోడ్లు డ్రైనేజీలు నిర్మిస్తామని గ్రామాలలో మౌలిక వసతులు కల్పిస్తామని సీతంపేట రాఘవపురం గ్రామాల మధ్య బ్రిడ్జి మంజూరు చేయడం జరుగుతుందన్నారు కొత్తగూడెం నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయడం కోసం అహర్నిశలు కృషి చేస్తున్నామని ప్రజలకు ఏ కష్టం వచ్చినా తమ దృష్టికి తీసుకురావాలని పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె సాబీర్ పాషా, పిఎసిఎస్ చైర్మన్ మండే హనుమం తరావు, టిపిసిసి సభ్యులు నాగ సీతారాములు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు చింతలపూడి రాజశేఖర్,డి ఎస్ ఓ రుక్మిణి, సీఐ రాయల వెంకటేశ్వర్లు, తహసిల్దార్ కృష్ణ ప్రసాద్ ఎంపీడీవో భారతి డిటి నాగరాజు,



ఆర్ ఐ లు ఏవో నర్మద, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వాసిరెడ్డి మురళి భూక్యా దస్రు సిపిఐ మండల కార్యదర్శి కుమారి హనుమంతరావు, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు ప్రజా సంఘాల బాధ్యులు అధికారులు తదితరులు పాల్గొన్నారు

# గ్రీవెన్స్ దరఖాస్తులు సత్వరమే పరిష్కరించాలి



**తొలి సమయం మహబూబాబాద్, జూలై.28**
సోమవారం జిల్లా కలెక్టరేట్ లోని ప్రధాన సమావేశ మందిరంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో రెవెన్యు అదనపు కలెక్టర్ కె. అనిల్ కుమార్ తో కలిసి గ్రీవెన్స్ లో ప్రజల నుండి వినతులు స్వీకరించారు.ఈ సందర్భంగా సీరోలు మండలం కాంపెల్లి గ్రామానికి చెందిన పుల్సాని రజిత, పుల్సాని శశిరేఖ తమ భూమి పి.ఓ.బి లో ఉందని అట్టి దాని నుండి తీసివేసి తమకు న్యాయం చేయాలని కోరారు.జిల్లా సీఐటీయూ ఉపాధ్యక్షులు బెస్ట్ అవేలబుల్ స్కీం ద్వారా ఎంపిక అయిన విద్యార్థులకు వెంటనే కార్పోరేట్ స్కూళ్ళలో అడ్మిషన్ ఇప్పించాలని, వారికి కావలసిన పుస్తకాలు, ఇతర వస్తువులు ఎలాంటి రుసుం లేకుండా ఇప్పించాలని కోరారు.గార్ల మండలం మర్రిగూడెం,లోక్యాతండ కు చెందిన భూక్య కిషన్ తనకు ఉన్న భూమిలో ఇందిరమ్మ ఇల్లు నిర్మించుటకు సర్వే డిపార్ట్మెంట్ వారు అనుకూలంగా రిపోర్ట్ ఇచ్చినప్పటికీ అట్టి భూమిలో ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకోవడానికి అడ్డు పడుతున్నారని, తన భూమిలో ఇందిరమ్మ ఇల్లు నిర్మించుటకు పర్మిషన్ ఇవ్వగలరని కోరారు.నేరెడ గ్రామానికి చెందిన రైతులు గతంలో (1970-72) లో జిల్లా కలెక్టర్ గారి ఆధ్వర్యంలో అప్పటి ప్రభుత్వం సర్వే నెం.545/1 లో గల 4 ఎకరాల 14 గుంటల భూమిని 47 మందికి సూమారు 14 గుంటల చొప్పున ఇచ్చారని, ఇప్పటివరకు పట్టాలు ఇవ్వలేదని, 2013-14 సం.లో మా పేర్లు రెవెన్యు రికార్డుల నుండి తొలగించారని అట్టి భూమి ప్రభుత్వ భూమి అని దుష్ప్రచారం చేస్తున్నారని తమరు మాకు న్యాయం చేయాలని కోరారు. బయ్యారం మండల బయ్యారం గ్రామ పంచాయతీకి చెందిన సిరిగద్దె మంజుల తన భర్త ఇర్సులాపురం గ్రామ పంచాయతీ లో పనిచేస్తున్న క్రమంలో 2003 సం.లో మరణించారని తనకు ఎలాంటి జీవనాధారం లేదని తనకు బయ్యారం గ్రామ పంచాయతీలో నైట్ వాచ్ మెన్ పోస్ట్ ఇప్పించాలని కోరారు.ఈ సందర్భంగా ఈ రోజు నిర్వహించిన గ్రీవెన్స్ లో వివిధ శాఖలకు సంబందించి (169 ) వచ్చిన దరఖాస్తులను సంబందిత శాఖా అధికారులకు చర్యలకై ఆదేశించారు.ఈ ప్రజావాణిలో జెడ్.పి సీ ఈఓ పురుషోత్తం, డి.ఆర్.డి.ఓ మధుసూధనరాజు, డి.ఎం.ఇండస్ట్రీ శ్రీమన్నారాయణ, మైనారిటీ డెవలప్మెంట్ అధికారి, శ్రీనివాసరావు, శ్రీనివాస్, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి దేశీరాం, సివిల్ సప్లై జిల్లా మేనేజర్ కృష్ణవేణి, ఇంచార్జ్ డి.డబ్ల్యూఓ శిరీష, డి.సి.ఓ వెంకటేశ్వర్లు, మత్స్య శాఖ అధికారి వీరన్న, ఎల్.డి.ఎం. యాదగిరి, కలెక్టరేట్ సూపరింటెండెంట్ మదన్ మోహన్,, భూభారతి కోఆర్డినేటర్ సురేష్, మండలాల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వికలాంగుల "సింహగర్జన"ను విజయవంతం చేయాలి

**తొలి సమయం నెల్లికుదుర్ జూలై 29**
మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం లో నిర్వహించిన సమావేశం వి.హెచ్.పి మండల అధ్యక్షులు హెచ్చు. వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మార్పీఎస్ ఇన్చార్జి కంటిపూడి అరుణ్ కుమార్ మాదిగ పాల్గొన్నారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ ఆగస్టు 13 వ తారీఖున జరిగే వికలాంగుల సింహ గర్జన మహా సభ కు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ఎమ్మార్పీఎస్ నాయకులు సంసిద్ధమై ఆగస్టు 13వ తారీఖున హైదరాబాదులో జరిగే వికలాంగుల సింహ గర్జనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అంతేకాకుండా గ్రామ గ్రామాన ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ గద్దె పనులను త్వరగా పూర్తి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు తూల్ల వెంకన్న మాదిగ, జిల్లా కార్యదర్శి బిర్రు యుగేందర్ మాదిగ, జిల్లా మహిళా అధ్యక్షురాలు మూసి పట్ల జ్యోతి, పిడుగు



హైమ, నాగలక్ష్మి, మైనార్టీ అధ్యక్షులు షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ ప్రమాదాల పట్ల జాగ్రత్తలు వహించాలి



**డివిజనల్ ఇంజనీర్, మహబూబాబాద్ ి పి.విజయ్**

**తొలి సమయం, ఇనుగుర్తి జులై 28:**
విద్యుత్ ప్రమాదాల పట్ల ప్రజలు జాగ్రత్త లు తీసుకోవాలని అన్నారు డివిజనల్ ఇంజనీర్ పి.విజయ్ ఇనుగుర్తి మండలంలోని పొలం బాట కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో రైతులతో మాట్లాడుతూ... వ్యవసాయ పొలాల దగ్గర స్టార్టర్ లకు మరియు మోటార్ లకు ఎర్తింగ్ చేసుకోవాలని అలాగే ఇంటి దగ్గర కూడా ఎర్తింగ్ చేసుకోవాలని తెలిపారు. దుస్తువులు ఆరవేయడానికి ఐరన్ వైర్ వాడకూడదని చెప్పారు. ఈ వర్షాకాలంలో చెట్లు విరిగి లైన్ ల మీద పడడం లేదా లైన్ తెగి కింద పడిపోయినప్పుడు వెంటనే రైతులు తమ లైన్మెన్ లేదా ఏఈ కి సమాచారం అందించాలని కోరారు.విద్యుత్ ప్రమాదాల సమయం లో విద్యుత్ టోల్ ఫ్రీ నంబర్ 1912 ఉపయోగించుకోవాలని తెలిపారు. ఇనుగుర్తి సెక్షన్ లో పనిచేస్తున్న ఇంజనీర్లకు మరియు విద్యుత్ సిబ్బందికి విద్యుత్ అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్ అందించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాజు ఏఈ మరియు ఎల్ ఐ బోడ శ్రీను, ఏల్ ఏం యశ్వంత్, శ్రీనివాస్, ఏ ఏల్ ఏం వేణు, నవీన్ మరియు విద్యుత్ సిబ్బంది తో పాటు మండలం లోని రైతులు పాల్గొన్నారు...

# బాధిత కుటుంబానికి LOC అందజేసిన ఎమ్మెల్యే మెగా రెడ్డి

**తొలి సమయం పెబ్బేరు జులై 28**



అనారోగ్యాన్ని గురై మెరువైన వైద్యం చేయించుకునేందుకు కుటుంబ ఆర్థిక పరిస్థితులు సరిగా లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆ కుటుంబానికి వనపర్తి ఎమ్మెల్యే గౌరవ శ్రీ తూడి మేఘారెడ్డి గారు చేయూతనందించారురూ.1,50,000 విలువగల LOC నీ మంజూరు చేయించి వారి కుటుంబానికి అండగా నిలబడ్డాడు వనపర్తి మండలం కడుకుంట గ్రామానికి చెందిన గొడుగు వెంకటయ్య గొడుగు బక్కన్న గత కొంతకాలంగా అనారోగ్యానికి గురయ్యారువారికి మెరుగైన వైద్యం అందించేందుకు తమకు సహాయ సహకారాలు అందించాలని వనపర్తి శాసనసభ్యులు గౌరవ శ్రీ తూడి మేఘారెడ్డి గారిని కోరగా అందుకు స్పందించినాయన ప్రభుత్వ పరంగా 1,50,000 LOC నీ మంజూరు చేయించారుఈ క్రమంలో మంజూరైన LOC నీ సోమవారం హైదరాబాదులోని మాదాపూర్ లో గల కార్యాలయంలో బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు

# టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాగా సీతారాములు ను సన్మానించిన బీసీ ఐక్యవేదిక



**తొలి సమయం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతనగర్ జూలై 28**
సుజాతనగర్ మండలం స్థానిక ఎన్నికల్లో బీసి లకు అండగా నిలవాల్సిన భాధ్యత అందరిపై ఉందని టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాగా సీతారాములు అన్నారు. సుజాతనగర్ లోని వారి స్వగృహంలో హ కలసిన బీసీ ఐక్యవేదిక బీసీ జాతీయ సలహాదారులు మిట్టపల్లి సాంబయ్య ఆధ్వర్యంలో బీసీ నాయకులు టీపీసీసీ జనరల్ సెక్రటరీ నియమితులవడం పట్ల హర్షం వ్యక్తం చేస్తు నాగా సీతారాములును శాలువాతో సత్కరించి, పూల బొకె అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు రాబోయే స్థానిక ఎన్నికల్లో బీసీ అభ్యర్థుల గెలుపుకు అందరం కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ జాతీయ సలహాదారులు మిట్టపల్లి సాంబయ్య, బీసీ జిల్లా అధ్యక్షులు పిఏ ప్రసాద్ గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ కౌడగాని శ్రీనివాస్ యాదవ్,బీసీ జిల్లా మహిళా అధ్యక్షురాలు కొదురుపాక మీనాక్షి, కొత్తగూడెం పట్టణ సెక్రటరీ మహంకాళి బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

# మదర్ తెరిసా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మహిళకు ఓ పాజిటివ్ బ్లడ్ రక్తదానం

## అడగగానే స్పందించి 44వ సారి ఓ పాజిటివ్ బ్లడ్ రక్తదానం చేసి మానవత్వాన్ని చాటిన ట్రస్ట్ సభ్యులు వనమా నవీన్ కుమార్




**తొలి సమయం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం జూలై 28**
భద్రాచల పట్టణంలోని ప్రైవేట్ హాస్పిటల్లో మణుగూరు పట్టణానికి చెందిన నాగమణి అనే మహిళ రక్త కణాల సంఖ్య 28 వేలకు పడిపోయి చికిత్స పొందుతుంది వైద్యులు ఎమర్జెన్సీగా రక్తం ఎక్కించాలని సూచించడంతో రక్తం కోసం ట్రస్ట్ ను ఆశ్రయించగా వెంటనే స్పందించి ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ సభ్యులు వనమా నవీన్ కుమార్ గారీ ద్వారా స్థానిక రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ నందు ఓ పాజిటివ్ బ్లడ్ రక్తదానం చేయించి మహిళను ఆదుకు న్నారు ఈ సందర్భంగా రక్తదాతకు ట్రస్ట్ నిర్వాహకులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు

# ఇల్లందు పట్టణంలో కొనసాగుతున్న పోలీసుల సెర్చ్ ఆపరేషన్



తొలి సమయం, ఇల్లందు.జూలై, 28. జిల్లా ఎస్పీబి రోహిత్ రాజ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు, కొత్తగూడెం ఓఎస్డి, ఇల్లందు డిఎస్పి సూచనల గాను... ఈరోజు ఇల్లందులో మావోయిస్ట్ వారోత్సవాల నేపధ్యంలో సరిహద్దుల్లో హై అలర్ట్..

**జూలై 28 నుండి ఆగస్టు 03 వరకు వారోత్సవాలు జరపాలని మావోయిస్టుల పిలుపు మేరకు**

ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, మహారాష్ట్ర మరియు ఆంధ్ర సరిహద్దుల్లో పోలీసుల విస్తృత తనిఖీలు చేపడుతూ, అదేవిధంగా ఈరోజు ఇల్లందు డిఎస్పి ఎన్.చంద్రభాను ఎస్ హెచ్ ఓ టీ.సురేష్,ఎస్సైలు శ్రీనివాసరెడ్డి హసీనా ల ఆధ్వర్యంలో పట్టణంలో సిబ్బందితో కలిసి విస్తృత తనిఖీలు నిర్వహిస్తూ ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తూ వారి వివరాలను సేకరిస్తున్నారు ఈ సందర్భంగా డిఎస్పి మాట్లాడుతూ పట్టణంలో మావోయిస్టుల కార్యకలాపాలకు ఎవరైనా సహాయపడితే అది మా దృష్టికి వస్తే మాత్రం వారిపై కఠినమైన చర్యలు తీసుకొని పడతాయని తెలియజేశారు...

# ,బాధితులను పరామర్శించిన మల్లి బాబు యాదవ్



**తొలి సమయం, ఇల్లందు.జూలై, 28.** కామేపల్లి మండలం పండితాపురం గ్రామానికి చెందిన పలిమెల రామ్మూర్తి ఇటీవల అనారోగ్యంతో మరణించారు. వారి దశదినకర్మ కార్యక్రమంలో పాల్గొన్న కామేపల్లి మాజీ జెడ్పిటిసి, డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్ రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. వారి వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేసి, వారి కుటుంబాన్ని ఓదార్చి నేనున్నానని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా అక్కడికి చేరుకున్న కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో అర్హులైన నిరుపేదలకు ప్రతి ఒక్కరికి ఇల్లు, రేషన్ కార్డు తప్పనిసరిగా ఇప్పిస్తానని, ఇలాంటి పథకాలు కేవలం కాంగ్రెస్ పార్టీ మాత్రమే చేయగలదని, గ్రామంలో రానివాళ్లు ఎవరైనా ఉంటే నా దృష్టికి తీసుకురావాలని, అర్హులని భావిస్తే తప్పకుండా వారికి మంజూరు చేపిస్తానని హామీ ఇచ్చారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో గ్రామపంచాయతీలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుందని, ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బానోతు నరసింహ నాయక్, గుండ్ల ఏసోబు, సూతగాని అబ్రహం, భూక్యా నాగేంద్రబాబు పాటిబండ్ల ప్రసాదు పలిమెల రవి, పలిమెల వెంకయ్య, బాధవత్ నాగరాజు మరియు బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు.

## హెచ్ ఐ వి నిర్ధారణ,చికిత్స అవగాహన పట్ల ప్రతి అధికారి సిబ్బంది తో బాధ్యత వ్యవహరించాలి

### జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి రవి రాథోడ్



**తొలి సమయం మహబూబాబాద్ జులై 28:** హెచ్ ఐ వి అవగాహన చికిత్స పట్ల ప్రతి అధికారి సిబ్బంది తో బాధ్యతగా వ్యవహరించాలి అన్నారు సోమవారం జిల్లా కలెక్టరేట్ లోని జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ కార్యాలయంలో హెచ్ఐవి / ఎయిడ్స్ నియంత్రణపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. రవి రాథోడ్ అధ్యక్షతన క్వార్టర్లీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి మాట్లాడుతూ, హెచ్ఐవి పాజిటివ్ కేసుల వివరాలు, వారు పొందే సేవలు, ఆర్ట్ సెంటర్ల పనితీరు, టార్గెట్ గ్రూపులకు (ఎఫ్ - ఎస్ డబ్ల్యూ, ఏం ఏం ఎస్, టీజీ, మైగ్రేంట్స్) అందజేసే సేవలపై సమీక్ష నిర్వహించారు. ప్రతి కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని,అన్నారు నిర్దిష్ట గమ్యాల ప్రకారం పనిచేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ విజయ్ కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్ కెవి రాజు, సబ్ యూనిట్ ఆఫీసర్ రామకృష్ణ,క్లస్టర్ ప్రోగ్రామ్ మేనేజర్ కే జ్యోతి, క్లినికల్ సర్వీసెస్ ఆఫీసర్ సారయ్య, సిపిఓ మహేష్,ఐ సి టి సి స్టాఫ్ రమేష్, ఎన్జీవోస్, లింక్ వర్కర్స్ పాల్గొన్నారు

# పెద్ద ప్రయత్నంలో సీఎం

**విజయవాడ, జూలై 27,**
ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భారీ ఆశలు పెట్టుకున్నారు. ఇప్పుడే నిర్మాణపనులు ప్రారంభమయ్యాయి. ప్రధానినరేంద్రమోదీ రీ లాంచ్ చేసిన తర్వాత అమరావతి పనులు వేగం అందుకున్నాయి. ఇక ప్రపంచ స్థాయి రాజధానిగా అమరావతిని తీర్చిదిద్దేందుకు చంద్రబాబు అన్ని రకాలుగా ప్రయత్నిస్తున్నారు. శాశ్వత భవనాల నిర్మాణాన్ని మొదటిదశ పనులను మూడేళ్లలో పూర్తి చేయాలని నిర్ణయించారు.

ఇక ఈ లోపు అమరావతికి అవసరమైన సొబగులు అద్దేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నారు. ప్రధానంగా అంతర్జాతీయ ప్రమాణాలతో రాజధాని ఉండేందుకు చంద్రబాబు డ్రీమ్ ప్రాజెక్టుకు వేగంగా అడుగులు పడుతున్నాయి.అందులో భాగంగా అమరావతిలో అంతర్జాతీయ ఎయిర్ పోర్టు నిర్మాణానికి శ్రీకారం చుట్టనున్నారు. ప్రస్తుతం విజయవాడకు గన్నవరం ఎయిర్ పోర్టు ఉన్నప్పటికీ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని అమరావతిలో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అలాగే అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంను నిర్మించాలని కూడా డిసైడ్ అయ్యారు. ఇందుకోసం మరో నలభై వేల ఎకరాల భూమిని రైతుల నుంచి సేకరించే లక్ష్యంగా అడుగులు పడుతున్నాయి. రైతులతో ప్రభుత్వం చర్చలు జరుపుతుంది. రైతులు కూడా తమ భూములను ల్యాండ్ పూలింగ్ కింద ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారు. అదే జరిగితే మొత్తం డెబ్బయి వేలఎకరాల్లో రాజధాని అమరావతి నిర్మాణం జరుగుతుంది. ఇక కేంద్ర ప్రభుత్వ సంస్థలను కూడా అమరావతిలో నెలకొల్పేందుకు ఢిల్లీ పెద్దలతో నిరంతరం టచ్ లో ఉన్నారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వంటి సంస్థలు ముందుకు వస్తే అదనపు ఆకర్షణగా నిలుస్తాయి. ఇక సాఫ్ట్ వేర్ కంపెనీలను కూడా అమరావతికి తీసుకు వచ్చేందుకు చంద్రబాబు తరచూ జాతీయ, అంతర్జాతీయ ప్రముఖులతో సమావేశమవుతున్నారు. అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. చేయాల్సిన ప్రయత్నాలన్నింటినీ చంద్రబాబు చేస్తూనే ఉన్నారు. పెట్టుబడుల కోసం రేపు సింగపూర్ కు బయలుదేరి వెళుతున్నారు. అయితే చుట్టుపక్కల ఉన్న హైదరాబాద్, చెన్నై, బెంగళూరు వంటి నగరాలను కాదని అమరావతికి రావాలంటే బిగ్ టాస్క్ అని చెప్పాలి. మరి చంద్రబాబు అటువంటి సమస్య నుంచి అమరావతిని ఎలా ముందుకు తీసుకెళతారన్నది ఆసక్తికరంగా మారింది

# లిక్కర్ స్కాం...రంగంలోకి ఈడీ

**నెల్లూరు, జూలై 28**
సిట్ దర్యాప్తు నడుస్తూనే ఉంది. ఇప్పటివరకు 12 మంది అరెస్ట్ అయ్యారు. ఏకంగా ఓ ఎంపీ జైలుకెళ్లారు. కనిపించకుండా పోయిన ఆ తొమ్మిది మందిని రప్పించే స్కెచ్ వేస్తున్నారు. నెక్ట్ ఓ పెద్ద నేత వంతు రావడం పక్కా అంటున్నారు. సరిగ్గా ఇదే టైమ్‌లో ఈడీ ఎంటర్ అయింది. దీంతో ఏపీ లిక్కర్ కేసు మరింత పీక్ లెవల్‌కు చేరుకుంది. ముడుపుల వ్యవహారంపై కూపీ లాగేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ రంగంలోకి దిగడంతో..వేడి రాజుకుంటోంది. ఏపీ లిక్కర్ కేసు ఇంకా స్ట్రాంగ్ కానుందా.? ఏపీ లిక్కర్ కేసు కీలక మలుపు తిరుగుతోంది. వేల కోట్ల ముడుపులు, విదేశీ లింకులు, హవాలా లావాదేవీలంటూ ఆరోపణలున్న ఈ కేసులో ఇప్పుడు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ రంగంలోకి దిగింది. మరోవైపు కొందరు నిందితులపై రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేసింది సిట్. విదేశాలకు వెళ్లిపోయిన వారిని రప్పించేందుకు అవసరమైతే ఇంటర్‌పోల్ హెల్ప్ తీసుకునే ప్లాన్ చేస్తోందట సిట్. కేసులో కీలకమైన 12 మంది అరెస్టు అయ్యారు. 9 మంది కీలక నిందితులు విదేశాలకు వెళ్లిపోయారు.లిక్కర్ స్కామ్‌లో కీ రోల్ ప్లే చేశారని అలిగేషన్స్ ఫేస్ చేస్తున్న ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్ట్ అయి రాజమండ్రి జైల్లో ఉన్నారు. ఆయన అరెస్ట్ అయినప్పటి నుంచే బిగ్‌బాస్‌గా చెప్తున్న వ్యక్తి చుట్టూ కూడా ఉచ్చు బిగుస్తోందన్న ప్రచారం మొదలైంది. ఇంకో నెల రోజుల్లోనే అసలు సూత్రధారిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న నేతను ఈ కేసులో రౌండప్ చేస్తారని ఇన్ సైడ్ టాక్. సరిగ్గా ఇదే టైమ్‌లో ఈ కేసులో ఈడీ ఎంటర్ అయింది. శర్వాణీ ఆల్కో బ్రూ కంపెనీ డైరెక్టర్ చంద్రారెడ్డిని విచారణకు పిలిచింది.వైసీపీ హయాంలో భారీగా లిక్కర్ ఆర్డర్లు పొందిన కంపెనీల్లో శర్వాణీ సంస్థ ఒకటి అంటున్నారు. ఈ వివరాలను సిట్ చార్జిషీటులో ప్రస్తావించిందట. శర్వాణీ కంపెనీ డైరెక్టర్ చంద్రారెడ్డికి ఎంపీ మిథున్ రెడ్డితో సహా పలువురు వైసీపీ నేతలతో సంబంధాలున్నాయంటున్నారు. సిట్ పలుసార్లు ఆయనకు నోటీసులు ఇచ్చినా విచారణకు రాలేదు. ఇప్పుడు..అదే చంద్రారెడ్డికి ఈడీ నుంచి పిలుపు వచ్చింది. అయితే ఈ స్టేజ్‌లో లిక్కర్ వ్యవహారంలో ఈడీ ఎంటర్ అవడం అతిపెద్ద డెవలప్‌మెంట్‌గా చెప్పొచ్చు.ఇన్నాళ్లూ సిట్ దర్యాప్తు సాగుతుండగా, ఈడీ ఎందుకు జోక్యం చేసుకోలేదని టీడీపీ ప్రశ్నిస్తూ వచ్చింది. బీజేపీ వైసీపీ పెద్దలను కాపాడుతోందనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. అయితే పీఎంఎల్ ఏ కింద ఇప్పుడు ఈడీ దర్యాప్తు స్టార్ట్ చేయడంతో ఈ అనుమానాలకు తెరపడినట్లయింది. శర్వాణి డిస్టిలరీస్ డైరెక్టర్ చంద్రారెడ్డికి నోటీసులు జారీతో లిక్కర్ వ్యవహారంలో మనీ లాండరింగ్‌పై ఈడీ ఫోకస్ పెట్టింది.ఇప్పటికే లిక్కర్ కేసు ఏపీ పాలిటిక్స్‌ను షేక్ చేస్తోంది. మిథున్‌రెడ్డి అరెస్ట్‌తో వైసీపీలో ఆందోళన ఇంకా ఎక్కువందన్న టాక్ వినిపిస్తోంది. త్వరలోనే ఈ కేసుపై సిట్ పూర్తిస్థాయి చార్జిషీట్ దాఖలు చేయనున్న నేపథ్యంలో..ఈ స్టేజ్‌లో ఈడీ ఎంటర్ అయిందంటే ఈ కేసు మరింత జఠిలంగా మారే అవకాశం కనిపిస్తోంది. సిట్ అలిగేషన్స్ నుంచి తప్పించుకుని బెయిల్ తెచ్చుకున్నా..ఈడీ కేసులు మాత్రం నిందితులకు తలనొప్పిగా మారడం పక్కా. మనీలాండరింగ్ అంటూ ఈడీ కేసు పెడితే నిందితులు మరింత ఇరకాటంలో పడిపోయినట్లే. బెయిల్ దొరకడం కూడా అంత ఈజీ కాదు.

# రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

### ఇల్లందు సీఐ తాటిపాముల సురేష్.



తొలి సమయం, ఇల్లందు.జూలై, 28.
ఇల్లందు పట్టణంలో ఈ రోజు సీఐ సురేష్ రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు.రాబోయే పంచాయతీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు రౌడీ షెటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు.చిన్న, పెద్ద నేరాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. గత నాలుగు రోజుల క్రితం ఇల్లందు సిఐ గా బాధ్యతలు చేపట్టిన సురేష్ పట్టణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు ప్రజల సహకారాన్ని పొందేందుకు ఇలాంటి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగానే మొదటిసారిగా రౌడీ షీటర్ లను సమీకరించి వారికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిఐ సురేష్ తో పాటు ఎస్సై శ్రీనివాస్ రెడ్డి, హసీన, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# పామాయిల్ తోట ధ్వంసం



**తొలి సమయం, ఇల్లందు.జూలై, 28.**
కారేపల్లి మండలం, పోలంపల్లి గ్రామంలో వీరన్న అనే రైతు 9 ఎకరాల పట్టా భూమిలో సాగుచేసిన పామాయిల్ తోటను అదే గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు నాలుగు రోజుల క్రితం పామాయిల్ తోటలో ధ్వంసం చేశారని రైతు వీరన్న వాపోయాడు. తన చేను పక్కనే ఉన్నటువంటి ఎటువంటి అనుమతులు లేని ఇటుక బట్టి నుంచి దుమ్ము ధూళి పర్యావరణ కారణంగా పంట నాశనం అవుతుందని బట్టి యజమానిపై గతంలో అధికారులకు ఫిర్యాదు చేశానని , ఇది మనసులో ఉంచుకొని నా పంటను అతను మరికొందరు కలిసి 9 ఎకరాల పామాయిల్ తోటను ధ్వంసం చేశారని రైతు వీరన్న వాపోయాడు. ఈ విషయంపై కారేపల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారని తెలిపారు. అధికారులు స్పందించి నా పంట నష్టం చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

# ఏపీలో కొత్తగా లక్ష మందికి ఫించన్లు

**గుంటూరు, జూలై 28**
ఏపీ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. భర్త చనిపోయిన వెంటనే వితంతువుకు పింఛన్ అందించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. గతంలో వైసిపి ప్రభుత్వం ఈ విధానాన్ని నిలిపివేసింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది లబ్ధిదారులు ఎదురుచూపులు చూస్తూ వచ్చారు. అటువంటి వారికి శుభవార్త చెప్పింది ఏపీ ప్రభుత్వం. 2023 డిసెంబర్ 1 నుంచి 2024 అక్టోబర్ 31 మధ్య భర్త చనిపోయిన భార్యలకు పింఛన్లు ఇచ్చేందుకు ప్రభుత్వం దరఖాస్తులు తీసుకుంది. అర్హులంతా వారి పత్రాలతో ఆన్లైన్లో దరఖాస్తు చేసుకున్నారు. భర్త పింఛన్ ఐడి, మరణ ధ్రువ పత్రం ఇవ్వడంతో వాళ్లను అర్హుల జాబితాలో చేర్చారు.వాస్తవానికి వీరందరికీ..జూన్ 12న కూటమి ప్రభుత్వంఅధికారంలోకి వచ్చి ఏడాది అయిన క్రమంలో పింఛన్లు ఇవ్వాలనుకున్నారు. కానీ వాయిదా పడింది. జూలై మొదటి వారంలో పింఛన్లు ఇస్తామని ప్రకటించారు. కానీ మళ్ళీ వాయిదా పడింది. అయితే ఆగస్టు 1న మాత్రం ఎట్టి పరిస్థితుల్లో వీరందరికీ పింఛన్లు అందించనున్నారు. ఆగస్టు 1న కొత్తగా లక్ష వరకు పింఛన్లు అందించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. దీంతో ప్రభుత్వం పై ప్రతినెలా రూ.43.66 కోట్ల భారం పడనుందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ రావు తెలిపారు. అయితే ఇకనుంచి భర్త చనిపోయిన వెంటనే ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకుంటే భార్యకు వితంతు పింఛను దక్కనుంది. ఇదో నిరంతర ప్రక్రియగా చేపట్టనుంది కూటమి ప్రభుత్వం.మరోవైపు దివ్యాంగులకు సంబంధించి పింఛన్ల విషయంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. బోగస్ ధ్రువపత్రాలతో పింఛన్లు పొందుతున్నట్లు ఆరోపణలు వచ్చిన క్రమంలో ప్రభుత్వం తనిఖీలు చేపట్టింది. గత ప్రభుత్వంలో తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో వేలాదిమంది దివ్యాంగ పింఛన్లు పొందారని గుర్తించింది. అటువంటి వారి పింఛన్లు తొలగించనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 7.86 లక్షల మంది దివ్యాంగులు ఉన్నారు. వీరిలో కొందరు నెలకు 6000 రూపాయల చొప్పున పింఛన్ తీసుకుంటున్నారు. అయితే చాలామందికి వైకల్యం లేకపోయినా.. ధ్రువపత్రాలు సృష్టించి అక్రమంగా తీసుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. మానసిక సమస్యలతో పాటు వినికిడి లోపం ఉందంటూ తప్పుడు ధ్రువపత్రాలతో పింఛన్లు పొందుతున్నట్లు తనిఖీల్లో తేలింది. అటువంటి వారిలో చాలామంది అనర్హులు ఉన్నారని.. త్వరలోనే సచివాలయాల వారిగా జాబితాలు ప్రదర్శించనున్నట్లు తెలుస్తోంది. ఒకటి రెండు రోజుల్లో దీనిపై క్లారిటీ రానుంది.